సమన్వయం లేకుంటే సమస్యలు పరిష్కరించేదెలా?

- సర్వసభ్య సమావేశానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి
- ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ స్పష్టీకరణ
- ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం లేదని చిన్న కంభం సర్పంచ్ ఆగ్రహం



కంభం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ



అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చిన్నకంభం సర్పంచ్ రసూల్

కంభం:

తొంబై రోజులకోసారి నిర్వహించే మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు కచ్చితంతా హాజరుకావాలని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. సమావేశానికి అధికారులు హాజరవడంతోపాటు పూర్తయ్యే వరకు ఉండాలని స్పష్టం చేశారు. అధికారులే ఆలస్యంగా వస్తే ఇక ప్రజా ప్రతినిధులు ఎలా వస్తారని ప్రశ్నించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వరా?

గ్రామాల్లో ప్రభుత్వ కార్యాక్రమాలు నిర్వహించే సమయంలో సర్పంచులకు కనీస సమాచారం ఇవ్వడం లేదని అధికారులపై చిన్నకంభం సర్పంచ్ రసూల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో జరిగే ఏ కార్యక్రమానికి తమను ఆహ్వానించడం లేదని, తాము ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రనిధులమన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. చిన్నకంభం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్‌ను, మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించి విద్యాశాఖాధికారులు చిరుద్యోగుల కడుపుకొట్టారని ఇలాంటి దుర్మార్గపు చర్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. లింగోజీపల్లి గ్రామంలో ఉపాధి పనులు ఎందుకు నిలిపివేశారని, ఉపాధి కూలీల దగ్గర వారానికి 100 రూపాయల చొప్పున వసూలు చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారని ఎల్‌కోట సర్పంచ్ మహమ్మద్ బాషా ఏపీఓను ప్రశ్నించారు. ఇరిగేషన్ కాలువల్లో మురుగు తొలగించి పక్కనే పడేయంతో ప్రజలకు అసౌకర్యంగా ఉందని కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమయపాలన పాటించని రేషన్‌షాపుల యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించే సమయంలో ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. తురిమెళ్ల గ్రామంలో వికలాంగులు, దివ్యాంగులకు ఇంటివద్దకు రేషన్ సరుకులు ఇవ్వాల్సి ఉండగా వేలిముద్రలు వేయించుకుని బియ్యం ఇవ్వకుండా వెళ్లిపోతున్నారని తురిమెళ్ల సర్పంచ్ సుభద్ర అధికారులకు తెలిపారు. యర్రబాలెం చెరువు పరిధిలోని తూములు, కాలువలు మరమ్మతులు చేయాలని సర్పంచ్ మడ్డు శ్రీనివాసయాదవ్ కోరారు. సమావేశంలో ఎంపీడీఓ వీరభద్రాచారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలి



గిద్దలూరులో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

గిద్దలూరు రూరల్: గ్రామాల్లో ప్రజా సమస్యలపై అధికారులు సత్వరమే స్పందించాలని ఎంపీపీ కడప లక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధానంగా పారిశుధ్యంతో పాటు నీటి సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో ప్రయత్నించాలన్నారు. ప్రజలకు అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా సేవలు అందించాలని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ రమణారెడ్డి, తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి, ఆర్‌ఐ భాస్కర్‌రావు, వైద్య ఆరోగ్య సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి



అర్ధవీడులో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకట్రావు

అర్ధవీడు: ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్య ధోరణిని విడనాడాలని ఎంపీపీ వెంకట్రావు హితవు పలికారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులకు నోటీసులివ్వాలని చెప్పారు. ఉపాధి హామీ కూలీలు వారం రోజులు పనిచేస్తే నాలుగు రోజులకు మాత్రమే కూలి ఇవ్వడంలో మతలబు ఏమిటని ఉపాధి హామీ ఈసీ బాలకృష్ణను ప్రశ్నించారు. పశువుల నీటి తొట్లను పొలాల్లో కట్టుకుంటున్నారని, వాటికి బిల్లులు ఎలా చేస్తారని వెలగలపాయ సర్పంచ్ గోదేశి రమణమ్మ ఉపాధి హామీ అధికారులను ప్రశ్నించారు. ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అవకతవకలపై ఎంపీటీసీలు గౌరి, నన్నెబోయిన రవికుమార్, అర్ధవీడు సర్పంచ్ వసంతమ్మ ప్రశ్నించారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీఓ కె.వీరరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు చెన్ను విజయ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా ఉందాం.. వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న అన్నా రాంబాబు

- దుర్మార్గంగా కూటమి ప్రభుత్వ తీరు
- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలందరూ కలిసికట్టుగా ఉండి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని జవహర్‌నగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో అన్నా రాంబాబు మాట్లాడారు. కార్యకర్తలకు ఏవైనా చిన్న చిన్న సమస్యలుంటే తన దృష్టికి తేవాలని, తాను శాయశక్తులా ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నానని, చిన్న చిన్న విభేధాలుంటే పక్కనపెట్టి అందరూ ఐకమత్యంగా ఉండి పార్టీ పటిష్టతకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అందరి ఆమోదంతో మార్కాపురం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా పోరెడ్డి చెంచిరెడ్డిని నియమించామని, పార్టీ శ్రేణులు సహకరించాలని, పార్టీ చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కూటమి ప్రభుత్వ తీరు దుర్మార్గంగా ఉందని, రోడ్డు యాక్సిడెంట్ జరిగితే పార్టీ కార్యకర్తలు, నాయకులు, చివరకు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై కూడా కేసు నమోదు చేసే దుస్థితికి ప్రభుత్వం వచ్చిందన్నారు. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న సంఘటనలు, పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ మనమే గెలవబోతున్నామని, మంచి రోజులు వస్తాయని, కార్యకర్తలు అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పోరెడ్డి చెంచిరెడ్డిని అన్నా రాంబాబు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, ఎంపీపీ బండి లక్ష్మీదేవి కృష్టారెడ్డితోపాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి



చెంచిరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మార్కాపురం: మార్కాపురం మండలంలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆ పార్టీ మండల అధ్యక్షుడిగా నియమితులైన పోరెడ్డి చెంచిరెడ్డి పేర్కొన్నారు. చెంచిరెడ్డిని లీగల్‌సెల్ అధ్యక్షుడు భూపని కాశయ్య, శివరాంపురం సర్పంచ్ గురుబ్రహ్మం, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య తదితరులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలందరూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేలా కృషి చేస్తానని, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని చెంచిరెడ్డి తెలిపారు.

రాయితీపై విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణ

మార్కాపురం: రాష్ట్రంలోని గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు లోడ్‌ను 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందని ఆ శాఖ ఏడీ సియానాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదనపు లోడ్ ఒక కిలోవాట్ ధర 2,250 కాగా రాయితీ పోను రూ.1250 చెల్లిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. ఈ అవకాశం ఈ నెల 30వ తేదీ వరకు ఉంటుందని స్పష్టం చేశారు. ఏపీసీపీడీసీఎల్ సర్కిల్లోని సమీప ఎలక్ట్రికల్, రెవెన్యూ ఆఫీస్, ఈ సేవ కేంద్రాలు, ఏపీసీపీడీసీఎల్ వెబ్‌సైట్‌ను సందర్శించి అదనపు లోడ్ క్రమబద్ధీకరించుకోవచ్చని సూచించారు.

క్లుప్తంగా

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

గిద్దలూరు రూరల్: మండలంలోని పొదలకుంటపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఎం.వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో ఎనిమిదేళ్లపాటు పనిచేసిన ఉపాధ్యాయులు మొర్రి పిచ్చయ్యయాదవ్, జక్కా రమాదేవి, జగ్జీవన్‌కుమార్‌ను సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



హెచ్ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన టి.ఆదినారాయణను శుక్రవారం సాయంత్రం తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల కమిటీ సభ్యులు సన్మానించారు. ఇంకొల్లులో పని చేస్తూ బదిలీపై గొట్లగట్టు హైస్కూల్లో నియమితులైన హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి, పాఠశాలలో వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

బృహద్ వారాహి అలంకారంలో జగదాంబ అమ్మవారు



మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని మార్కండేశ్వరస్వామి ఆలయంలోని జగదాంబ అమ్మవారు వారాహి నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం బృహద్ వారాహి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆంజనేయశర్మ, వరుణ్‌తేజ, అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

క్షయ వ్యాధిపై ఖైదీలకు అవగాహన



సబ్‌జైల్లో అవగాహన కల్పిస్తున్న పీపీఎం కోటేశ్వరరావు

మార్కాపురం టౌన్: టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మార్కాపురం సబ్ జైల్లో ఖైదీలకు డాక్టర్ డి.శివారెడ్డి శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఛాతి నొప్పి, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం తదితర లక్షణాలతో బాధపడుతుంటే వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎక్స్‌రే, క్లె పరీక్ష ద్వారా టీబీ వ్యాధి నిర్ధారణ అవుతుందన్నారు. టీబీ బాధితులకు ఆరు నుంచి తొమ్మిది నెలలపాటు ఉచితంగా మందులు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ దుర్గ శ్రీనివాస్, జిల్లా పీపీఎం కోటేశ్వరరావు, ఎంపీహెచ్‌ఈఓ ఎస్.చలపతిరావు, టీబీ యూనిట్ సిబ్బంది పి.గోవిందరాజులు, పి.లక్ష్మీరెడ్డి, ప్రత్యూష, మంత్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జూలై 9న సమ్మెలోకి మధ్యాహ్న భోజన కార్మికులు



సమ్మె నోటీసు ఇస్తున్న సీఐటీయూ మండల కార్యదర్శి థామస్

రాచర్ల: వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులతోపాటు స్కూల్ శానిటేషన్ కార్మికులు జూలై 9వ తేదీన జాతీయ కార్మిక సంఘాలు చేస్తున్న సమ్మెలో పాల్గొంటున్నట్లు సీఐటీయూ మండల కార్యదర్శి డి.థామస్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 24 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్పు చేసి కార్మికుల హక్కులను హరించిందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు, స్కూల్ శానిటేషన్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైరైన తరువాత కార్మికులకు పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికుల సంఘ నాయకులు ఎ.నాగలక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ అంతరాయం

కొమరోలు: మండలంలో కొత్త విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో శనివారం నుంచి 4 రోజులపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్ర, శని, ఆది, సోమవారాల్లో ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు కొమరోలు, చింతలపల్లె, సూరవారిపల్లె గ్రామ పంచాయతీల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని వివరించారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

అర్ధవీడు: మండలంలో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్న నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు సరపరా నిలిపేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాల ప్రజలు గమనించి, విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని డీఈఈ కోరారు.

రాచర్ల: రాచర్ల, అనుమలవీడు, మేడంవారిపల్లె గ్రామాల్లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ శాఖ డీఈఈ శేషగిరిరావు, ఏఈ బాలగురవయ్య తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

ఘనంగా జగన్నాథ ఆలయ వార్షికోత్సవం



ఆలయం వద్ద మహిళల కోలాట ప్రదర్శన

మార్కాపురం టౌన్: మార్కాపురం మండలంలోని రాయవరం(ఆర్ఎస్) వద్ద కొలువై ఉన్న బలబద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు పురుషోత్తమాచార్యులు, లక్ష్మణచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ఉభయ దేవేరులతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి కల్యాణం, అనంతరం శాంతి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన భక్తులను అలరించింది. రాత్రికి స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

పీడీసీసీబీకి మేనేజర్ నియామకం

సాక్షి ఎఫెక్ట్..



రైతుల కష్టాలపై 'సాక్షి'లో ఇటీవల ప్రచురించిన కథనం

బేస్తవారిపేట: బేస్తవారిపేటలోని ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మేనేజర్ రెండు నెలలుగా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త రుణాలు ఇవ్వకపోవడం, గతంలో తీసుకున్న రుణాలను రెన్యువల్ చేయకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై ఈనెల 20వ తేదీన ‘సబ్సిడీ దూరం.. అదనపు వడ్డీ భారం’ శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. కురిచేడు బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్న దేవశెట్టి శ్రీనివాసులును బేస్తవారిపేట పీడీసీసీబీకి మేనేజర్‌గా నియమించారు. రెగ్యులర్ మేనేజర్ బాధ్యతలు చేపట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

గిద్దలూరు రూరల్: రేషనలైజేషన్‌లో భాగంగా నియోజకవర్గ ఈఆర్ఓ ఎం.వెంకటశివారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు శుక్రవారం పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఎస్వీ జూనియర్, డిగ్రీ కళాశాలల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. 1200కు పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను రెండుగా మార్చే యోచనలో భాగంగా పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో జరగబోయే ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి వసతులు కల్పించాలనే విషయమై చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి, కమిషనర్ ఈ.వి.రమణబాబు, ఎలక్షన్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పిల్లలను బడిబాట పట్టించాలి

కంభం: మండలంలో 6 నుంచి 14 ఏళ్ల మధ్య వయసుండి బడిబయట ఉన్న పిల్లలను, మధ్యలోనే బడి మానేసిన చిన్నారులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీఓ వీరభద్రాచారి, ఎంఈఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీఆర్పీలు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మండలంలో 847 డ్రాపౌట్ విద్యార్థులు నమోదై ఉన్నారని, అందుకు గల కారణాలపై సమగ్రంగా విశ్లేషించి వారిని బడిబాట పట్టించాలన్నారు. సమావేశంలో మండల సమన్వయకర్త చిన్ని పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు ఇంద్ర బస్సులు ఏర్పాటు చేయాలి

కంభం: గిద్దలూరు నుంచి కంభం, మార్కాపురం మీదుగా హైదరాబాద్ వెళ్లేందుకు ఏపీఎస్‌ఆర్టీసీ ఇంద్ర బస్సు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని శుక్రవారం విజయవాడలో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు వినతి పత్రం ఇచ్చినట్లు షెడ్యూల్ కులాల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు ఓ ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు, కంభం నుంచి రోజూ సుమారు 500 మంది వరకు ఉద్యోగాలు, వివిధ పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్తుంటారని, ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు గిద్దలూరు డిపో నుంచి రెండు ఇంద్ర బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఎండీని కోరినట్లు వివరించారు.

బాధ్యతలు స్వీకరించిన వైద్యాధికారులు

కొనకనమిట్ల: మండలంలోని కొనకనమిట్ల, గొట్లగట్టు ప్రాథమిక వైద్యశాల డాక్టర్లుగా విజయకుమార్‌రెడ్డి, ఎస్వీ.బాలయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయకుమార్‌రెడ్డి శ్రీకాకుళం జిల్లా పలాస మండలం నుంచి కొనకనమిట్లకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఎస్వీ.బాలయ్య గొట్లగట్టు ప్రభుత్వ వైద్యశాలకు బదిలీ అయ్యారు. గొట్లగట్టులో ఇటీవల వరకు పనిచేసిన పృథ్వీరాజ్ పీజీ చదివేందుకు వెళ్లారు. డాక్టర్లకు వైద్యశాలల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

స్కూల్ బస్సు ప్రమాదాల నివారణ బాధ్యత యాజమాన్యాలదే..

- పాఠశాలల యజమానుల సమావేశంలో సీఐ సుబ్బారావు



మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు, పక్కన ఎస్సైలు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో స్కూల్ బస్సులు ప్రమాదాలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత యాజమాన్యాలు, డ్రైవర్లపై ఉందని సీఐ సుబ్బారావు పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో మార్కాపురం పట్టణంలోని వివిధ ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. స్కూల్ బస్సుల్లో భద్రతా లోపాలను సరిదిద్దాలని చెప్పారు. బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్లు, పాఠశాలల్లో అగ్ని ప్రమాదాల నివారణ సామగ్రి ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థినులకు గుడ్‌టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పట్టణంలో స్కూల్ బస్సులు నెమ్మదిగా నడపాలని డ్రైవర్లకు సూచించారు. సమావేశంలో ఎస్సైలు రాజమోహన్‌రావు, సైదుబాబు, అహరోన్ తదితరులు పాల్గొన్నారు.